# దివ్యౌషధం

"ఏమోయ్ కుర్రడాక్టరూ! నీకోసమే చూస్తున్నా! ఇదిగో శ్రీదేవీ! అబ్బాయి వచ్చాడు గాని, నాలుగు మల్‌గోవా మామిడిపళ్ళు పట్టుకురా."

"నాకొక్కటైతే చాలు! మిగిలిన మూడూ మీకా మేష్టారూ?" వినయం ఉట్టి పడుతుండగా ప్రశ్నించాడు డాక్టరు రమణమూర్తి.

"ఒక్కసారిగా మూడు మామిడిపళ్ళు తినడం చాలా ప్రమాదకరమని వైద్యశాస్త్రం చెబుతుందా ఏమిటి మూర్తీ?" మరింత అమాయకంగా ప్రశ్నించారు నారాయణరావుగారు.

"గురు శిష్యుల మధ్య రగడ రాజుకుంటోందన్నమాట!" నవ్వుతూ హాల్లోకి వచ్చింది శ్రీదేవమ్మ.

"చూడు మిస్టర్ మూర్తీ! నువ్వు మీ పెద్దమ్మ మాటలకు పెద్దగా పరిగణన ఇవ్వగూడదు. మాటిమాటికీ నా ఒజ్జరికాన్ని జ్ఞప్తికి తేవడం ఆమె కలవాటు. హైస్కూల్లో, అదీ యస్సెస్సెల్సీ క్లాసులో నీకు నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్పానేమో, ఆ మేరకే మన గురు శిష్య సంబంధం! వైద్యశాస్త్ర విజ్ఞానం నువ్వు కళాశాలలో సంపాదించుకున్నది. ఆ శాస్త్రానికి సంబంధించినంతవరకూ నువ్వు డాక్టరువి. నేనొక మానవుణ్ణి. ఇక్కడ మానవుడనగా ఏ క్షణాన్నయినా డాక్టరుగారి ప్రాబల్యానికి లోనై అతడి నిగ్రహానుగ్రహాల్లో దేనికో ఒకదానికి గురి కావలసివున్న ఒకానొక సజీవప్రాణి అని నిర్వచనం! మామిడిపళ్ళేగాదు, నువ్వు మంచినీళ్ళు త్రాగడం ఆరోగ్యకరం కాదని చెప్పు, మరుక్షణంనుంచీ నేను మంచినీటిని ముట్టుకుంటే ఒట్టు..."

"నీకు పుణ్యముంటుందిగాని దాహమైనప్పుడల్లా ఓ టంబ్లర్ పాయసం త్రాగమని చెప్పవయ్యా మూర్తీ! మీ మేష్టరుగారికి పాయసమంటే చాలా యిష్టం..." మళ్ళీ కలుగజేసుకుంది శ్రీదేవమ్మ.

"ప్చ్, ప్చ్. నువ్వు లాభం లేదు శ్రీదేవీ! ఇలా యింటిగుట్టు డాక్టర్లకు చెప్పుకోవచ్చా! రేపు నాకు ముక్కే నొచ్చిందనుకో. ముఖమే వాచిందనుకో, డాక్టరేమంటాడు? 'నేను చెబుతున్నాను మేష్టారూ! మీరు తీపి వస్తువులు తినడం బాగా తగ్గించేయాలి' అనడూ! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోడం బుద్ధిమంతుల లక్షణమేనా చెప్పు..."

పంతులుగారు శిష్యుణ్ణి ఎగతాళి పట్టించడం మామూలే! కాని ఆవేళ పరిహాసం కాస్త శ్రుతి మీరిందేమో! శిష్యుడి ముఖం చిన్నబోయింది. ప్రాక్టీసు క్రొత్తదే అయినా 'క్రొత్త వింత, పాత రోత' అన్న లోక సంప్రదాయం రీత్యా నైతేనేమి, ఉత్సాహంతో, ఓదార్పుతో శ్రద్ధగా కర్తవ్యాన్ని నిర్వహించడంవల్లనైతేనేమి, డాక్టరు మూర్తికి చేతినిండుకూ పని తగులుతోంది. నిర్ణీత సమయాల్లో ఆసుపత్రిలో పనిచేసి, ఆసుపత్రికి రాలేని రోగులకోసం తెరిపి దొరికినప్పుడల్లా పట్టణాన్నొక చుట్టు వేసుకుని వచ్చి అనుదిన వ్యాసంగాల ఒత్తిడిలో అసురుసురైపోయిన తర్వాత మూర్తికి కాసేపు ఉల్లాసంగా కాలం గడపాలనిపిస్తుంది. అరగంటసేపు ఈ పురాణ దంపతుల సమక్షంలో కూర్చుని ఆ తరువాత వెళ్ళి పడుకుంటే హాయిగా నిద్రకూడా వచ్చేస్తుంది. అలాగైతే తన ఉబలాటంకొద్దీ ఇలా

రావడమే తన పొరబాటా! తరచుగా వస్తున్నాడుగదా అని తననిలా లోకువచేసి పారేస్తారా మేష్టరుగారు...!

పెదముఖం పెట్టుకుని గోడవైపు చూస్తూ కూర్చున్నాడు మూర్తి. అయిదు నిమిషాలవరకూ హాల్లో నిశ్శబ్దమే ఆవరించింది.

మళ్ళీ రావుగారే ప్రారంభించారు- "పరధ్యానంగా కూర్చున్నావేం శ్రీదేవీ! ముక్కలు కోసి పెట్టు. మనకిద్దరికీ చెరొక పండు; మూర్తికేమో రెండు. ఎందుకంటే భోజనానంతరం పళ్ళు తినడం మంచిది. ఆ మాట ఆరో తరగతి సైన్సు పాఠంలో ఉంది..."

విసురుగా అడ్డు తగిలాడు మూర్తి!- "వద్దులేండి పెద్దమ్మగారూ! కొంతసేపు కబుర్లు వినిపోవచ్చుననే నేనిలా రావడం..."

"అబ్బాయికి కోపం రానే వచ్చింది. రాకేం చేస్తుంది? ఏనాడో మీ దగ్గర చదువుకున్నాడన్న చొరవతో మీరెంత మాటలంటే అంత మాటలనడం ఏం సబబు?" నిలదీసి ప్రశ్నించింది శ్రీదేవమ్మ.

"సబబుకాదని నీకే అనిపిస్తే నాకిక క్షమాపణ చెప్పుకోక తప్పుతుందా శ్రీదేవీ! శిష్యులకు గురువులు క్షమాపణలు చెప్పుకోవలసి వస్తున్న సుదినాలే యివి? చెప్పండి. మీరిద్దరూ కలిసి ఏ శిక్ష విధించినా సరే, శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాను..."

"అలాగన్నారు గనుక బాగుంది. అవునా మూర్తీ! శిక్షగా మరొకటీ మరొకటీ ఎందుకూ! ఈ నాలుగుపళ్ళూ ఆయన్నే తినేయమంటే సరిపోదూ!"

"ఎలాగైనా డాక్టరు మనవాడేనని నీ ధీమా! చూడు శ్రీదేవీ! ఎక్కడ బావా అన్నా వంగతోట దగ్గర మాత్రం బావా అనగూడదు..."

ఎంతగా పెదవులకు తాళం వేసుకుని కూర్చున్నా హఠాత్తుగా పెల్లుబికిన చిరునవ్వుల వరదకు ఆనకట్ట వేయలేకపోయాడు మూర్తి. "బాగుందిలేండి మేష్టరుగారూ! అప్పటికి నేను మీకు మందులిచ్చీయిచ్చీ అలసిపోతున్నట్టు! ప్రాక్టీసు ప్రారంభించి దాదాపుగా ఏడాది కావస్తోంది నేను. ఇంతవరకు నా ఆసుపత్రి ముఖమైనా చూడనివాళ్ళు మీరొక్కరే!"

"మూర్తీ, మూర్తీ!" బ్రతిమాలుతున్నట్టుగా అన్నారు రావుగారు. "ఎంత చెడినా నీకు నేను గురువునే అనుకున్నాను. ఆ విధంగా నిన్న నా శ్రేయోభిలాషి క్రిందనే జమ కట్టాను..."

పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వసాగాడు మూర్తి. "చూచారా పెద్దమ్మగారూ! మేష్టరుగారి ధోరణే యింత! బెంచీ ఎక్కించడం, బెత్తంతో బాదడంలాంటి కఠిన శిక్షణ మాకు రివాజే! కానీ అంతలోనే దగ్గరికి పిలిచి ఒక మాట అని, నాలుగు నవ్వులు నవ్వించి, "వెళ్ళరా బాబూ" అని బుజ్జగించి పంపేసేవారు. అందువల్లనే మేష్టరుగారంటే భయమూ, భక్తీగూడా ఉండేవి..."

"ఆ భయభక్తుల్ని భూతం తినిపోయిందిలేవోయ్ మూర్తీ! భూతమంటే భూతకాలమని భావం! ఇప్పుడామాటెందుకుగానీ, నువ్వు పళ్ళు తిను..."

పళ్ళు తింటూ ఆలోచనలో పడ్డాడు మూర్తి - రోగాలు మనిషికి కాక మ్రానికొస్తాయా అన్నది లోకోక్తి. అనగా మనిషికీ రోగాలకూ ఏదో గాఢమైన అనుబంధమే ఉందన్నమాట!

ఆహ్వానం పంపకపోవచ్చు. మనకు బొత్తిగా యిష్టమూ లేకపోవచ్చు. ఐనా మన అభిప్రాయంతో ప్రసక్తి పెట్టుకోకుండా తమంతట తామే ఠీవిగా వచ్చి, ఇంట మకాంపెట్టి, తిన్నంతకాలం సుష్టుగా తిని, చిట్టచివర బస్సు ఛార్జీలకు సైతం డబ్బు గుంజుకు వెళ్ళే బంధువుల లాంటివి జబ్బులు. వాటి బారికి గురికాని మానవుడుండడు. తనకి సరిగ్గా తెలియదుగాని మేష్టరుగారికైనా ఎప్పుడో ఒకప్పుడు జ్వరం, జలుబు, తలనొప్పిలాంటి మామూలు రకం జబ్బులైనా వచ్చి ఉండకపోవు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నావు మూర్తీ!" నింపాదిగా అడిగారు రావుగారు.

"అలాగైతే మీరెప్పుడూ జబ్బుముఖమే చూడలేదా మేష్టారూ?" అన్న ప్రశ్న నాలుక చివరిదాకా వచ్చి అక్కడే ఆగిపోయింది. ఆ తొట్రుబాటులో తన ప్రశ్నకొక మారువేషం తగిలించాడు మూర్తి. "మరేం లేదండీ మేష్టారూ? మనిషికి జబ్బులెందుకొస్తాయా అని?"

"ఏమిటోనబ్బా! నేనెన్నడూ ఆ అంశం పైన ఆలోచనలు పెట్టుకోలేదు. అలాంటి జిజ్ఞాసకు పూనుకోడానికి తీరికుండాలి గదా! నాకు లేనిదే అది! క్రమశిక్షణ, సిలబస్సు, పరీక్షలు - ఈ బడిగోడల పరిమిత పరిధిలోనే ముప్ఫై యేళ్ళ సర్వీసు గడిచిపోయింది. ఇంకో అయిదేళ్ళు యిలాగే పనిచేసి రిటయిరైతే, ఆ తరువాత కొన్ని ముఖ్య విషయాలను గురించి తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చోవాలన్న సదుద్దేశం మాత్రం లేకపోలేదు. ఐనా యిప్పటికిప్పుడు జబ్బులెందుకొస్తాయన్న ప్రశ్నకు గాకపోయినా, అవి ఎవరికోసం వస్తున్నాయో చెప్పగలను. కాని ఎందుకులే బాబూ, చెబితే మళ్ళీ నీకు కోపం రావచ్చు..."

"ఫరవాలేదు చెప్పండి మేష్టారుగారూ..." ప్రాధేయపడ్డాడు మూర్తి.

"జబ్బులెందుకొస్తున్నాయన్న విషయముంది చూచావూ, అదొక మహా రహస్యం! ఆ రహస్యం కాస్తా తెలిసిపోతే వెనువెంటనే దానికి నివారణోపాయాలుగూడా తయారౌతాయి. ఆ తరువాత పరిణామాలను గురించి నేను వేరే చెప్పాలా మూర్తీ! బయట తగిలించుకున్న బోర్డులను వూడబెరికి డాక్టర్లు తమ తమ వైద్యాలయాలను మూసుకోవలసిందే గదా!"

మేయబోయి మెడ తగిలించుకున్న చందంగా యిరుకున పడిపోయాడు మూర్తి. కాని అంతలోనే తెప్పరిల్లి "అయితే డాక్టర్లుండడం అనారోగ్య నివారణకేగాని ఆరోగ్య పరిరక్షణకు కాదని మీ అభిప్రాయం" అన్నాడు.

"బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. ఈ జబ్బుల గొడవ కాస్తా కట్టిపెట్టి మరేదైనా లోకాభిరామాయణంలోకి దిగగూడదూ!" మంచినీళ్ళకోసం లోపలికి వెళ్తూ అంది శ్రీదేవమ్మ.

మొదటి ఆటనుంచి తిరిగి వెళ్తున్న సినిమా ప్రేక్షకులతో బాటుగా యిల్లు చేరుకున్నాడు మూర్తి. పడుకున్నాడేగాని నిద్ర పట్టిందిగాదు. ఈరోజు మేష్టరుగారిద్వారా అవగతమైన విషయం తనకు క్రొత్తదేమీగాదు. డాక్టర్ల తోడ్పాటు తమకెంతగా అవసరమైనా లోకుల కెందుకో వాళ్ళపట్ల సదభిప్రాయం ఉన్నట్లు తోచదు. చిన్ననాడు తను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో 'డాక్టరా, లాయరా, ఎవరు గొప్ప' అన్న విషయంపైన ప్రసంగాలు జరిగేవి. లోకంలో టీచర్లు, గుమాస్తాలు, దర్జీలు, ఇన్సూరెన్స్ ఏజంట్లు మొదలైన వృత్తిదారులెందరో ఉండగా, డాక్టర్లకు, లాయర్లకు మాత్రం లంకెగలిపి వారిలో ఎవరు

గొప్ప, ఎవరు తక్కువ అన్న మీమాంసకు పూనుకోవలసిన అవసరమేమిటో తనకర్థమయ్యేది గాదు. బహుశా యిది కారణమైతే గావచ్చు - ఈ రెండు వృత్తులూ ప్రధానంగా మానవుడి బలహీనత పైన ఆధారపడి కొనసాగేవి. న్యాయాన్ని ధిక్కరించడానికి కారణం మానసిక దౌర్బల్యమైతే, జబ్బులకు గురికావడానికి హేతువు శారీరక బలహీనత. కాని తమతో ఎదుటివాడికి ఏర్పడిన అవసరంలోనుంచి ఎంతగా వీలైతే అంతగా డబ్బు పుట్టించాలన్న కక్కుర్తి పైన పేర్కొన్న రెండు వ్యక్తులకే పరిమితమైనదేమీగాదు. క్లాసులో ఊకదంపుడు మాటలే చెబుతూ వచ్చి, పరీక్షలకు ముందుగా తమ దగ్గర ట్యూషన్లు చెప్పించుకోకపోతే గడచి గట్టెక్కడం అసాధ్యమని హెచ్చరికలు పలికే ఉపాధ్యాయులెంతమంది లేరు? పడవలసిన మామూలు జేబులో పడితేగాని ఫైలును టేబులు దాటనివ్వని గుమాస్తాలెంతమంది లేరు? జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ నిస్వార్థంగా పని చేయడానికి ఎంతటి అవకాశమైతే ఉందో, దగాచేసి మూటలు ముల్లెలు కట్టుకోడానికైనా అంతే అవకాశం ఉంది. మరైతే ప్రత్యేకించి లాయరీ, డాక్టరీలను మాత్రం తప్పుపట్టడం ఏం న్యాయం?

ఈ అన్యాయానికి తోడు తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లు బ్రతకలేరన్న వితండవాదం ఒకటి! అప్పటికి డాక్టర్లు నిక్షేపంగా బ్రతుకు గడిచిపోవాలన్న ఉదారబుద్ధి గలిగినవారై స్వప్రయత్నంలో జబ్బులు కొనితెచ్చుకున్నట్టు. తనకోడీ, తన కుంపటీ లేకపోతే లోకానికి తెల్లవారదనుకున్న ముసలమ్మలా తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లకు బ్రతుకు లేదని భావిస్తున్నట్టున్నారు లోకులు! అబ్బే, యిదేం బాగుండటం లేదు!

మరునాటి ఉదయం కొంత ఆలస్యంగా నిద్ర లేచాడు మూర్తి. అరగంట ఆలస్యం అయిందేమో, ఆసుపత్రికి వెళ్ళేసరికి వెయిటింగు రూం నిండుకూ కిక్కిరిసి ఉన్నారు రోగులు. వేళకింత తిండీ నీళ్ళూ తీసుకుంటున్నట్టుగా ప్రతిరోజూ యిన్ని మందునీళ్ళు లోపలికి పుచ్చుకుంటూ జబ్బుకు అలవాటుపడిపోయిన పాత రోగులు కొందరు డాక్టరు గారిని సందర్శించారు. వాలకాన్ని బట్టి చూస్తే మానవుడు ఆరోగ్యంగా, ఆనందంగా బ్రతకవచ్చునన్న స్పృహే వారికున్నట్టు లేదు. హిమాలయాలపైన గడియకొక రకంగా వాతావరణం మారుతుందని చెబుతారు. ఆ విధంగా ఒకప్పుడు బాగా తగ్గినట్టు కనిపించి, మరొకప్పుడు విపరీతంగా విజృంభించినట్టుగా తోచే రోగ ప్రభావం క్రింద రంగులు మార్చుకుంటూ సహజసౌందర్యాన్ని కోల్పోయిన వాళ్ళ ముఖాలకేసి చూస్తూ డాక్టరు మూర్తి నిర్విణ్ణుడైపోయాడు. వీళ్ళ నిస్సహాయ పరిస్థితిని మాటల్లో వర్ణించి చెప్పడం కష్టం. లేదంటే ఒక పోలిక చెప్పవచ్చు. బలవంతుడు, దుర్మార్గుడు అయిన శాత్రవుడికి, వాడు శత్రువన్న సంగతి తెలుసుకోకుండా స్వంత యింటిని అద్దెకిచ్చి, వాడా యింటినిక ఖాళీ చేయడం కుదరదని భీష్మించుకుని కూర్చుంటే ఏం చేయడానికీ పాలుపోక పంచలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న యింటి యజమానిలా వీళ్ళు తెల్లబోయి ఉన్నారు. పాలుపోయిన ఈ చవిటిపర్రలో ఉద్యానవనాలు తలలెత్తకపోతే మానె! పచ్చికైనా మొలవదా అన్నదే వీళ్ళ ఆశ! స్వరాజ్యం ఒకరు వేరొకరికి ప్రసాదించే భిక్షం కాదనీ, అది ఎవరికి వారే సంపాదించుకోవలసిన జన్మహక్కనీ అన్నాడట మహాత్ముడు. ఆరోగ్యానికి

సంబంధించినంత వరకూ అలాంటి ఆత్మవిశ్వాసం వీళ్ళల్లో ఏనాడో నశించి పోయినట్టుంది...

వైద్యశాస్త్రం అనారోగ్యానికి బోలెడన్ని కారణాలను ఏకరువు పెడుతుంది. నివారణోపాయాలుగూడా చెబుతుంది. విచిత్ర మేమిటంటే వైద్యశాస్త్ర విజ్ఞానం పెరిగినకొద్దీ క్రొత్తగా కొన్ని జబ్బులూ పుట్టుకొస్తున్నాయి. వాటికి చిత్రవిచిత్రమైన చికిత్సా విధానాలూ అన్వేషింపబడుతున్నాయి. కాని ఆరోగ్యవంతుడి కిదంతా కాబట్టడంలేదు. అతడు తన జీవితాన్నొక మధురగీతంలా ఆలపించుకుంటూనే ఉన్నాడు.

అలాగని ఆరోగ్యవంతుడైన మానవుడు ఆరోగ్య శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివి దాని సలహాను, హెచ్చరికలను విధిగా పాటిస్తున్నాడనడానికి దాఖలాలు లేవు.

డాక్టర్లు రోగ నిదానం చేయగలరు. ఔషధాలు నిర్ణయించగలరు. పథ్యం చెప్పగలరు! అంతకుమించిన గారడీపనితనంతో జబ్బులను మటుమాయం చేయలేరు. కాని ఈ వాస్తవాన్ని రోగులు గుర్తించరు. ఒక చిన్న మాత్రగానో, ఒకటి, రెండు ఔన్సుల ద్రవంగానో, కొన్ని గ్రాముల సూదిమందుగానో సర్వరోగ నివారణిగా ఒక దివ్యౌషధాన్ని వైద్యశాస్త్రం కనిపెట్టగలిగితే బాగుండునన్నదే వాళ్ళ కోరిక. శాస్త్రం అందులో కృతకృత్యత నందుకోగలిగే సూచనలు కనుచూపుమేరలో కనిపించవు. ఎటొచ్చీ ఉపాయాంతర మొక్కటే కనిపిస్తుంది. దుఃఖాల కన్నింటికీ కోరికలే కారణం గనుక, తీర్చుకోడానికి ప్రయత్నించడంకన్నా వాటిని సమూలంగా తుడిచిపెట్టడమే మంచిదని తత్వజ్ఞులు చెబుతారు. ఆ విధంగా ఆలోచిస్తే జబ్బులకు నివారణోపాయాలు కనిపెట్టడంకన్నా, ఆరోగ్యానికి మూలకారణం కనిపెట్టడమే సులభమేమో!

ఉదయం పది గంటలకు ఆసుపత్రిలో పని ముగిసిన తర్వాత పట్టణంపైన మొదటి రౌండు బయలుదేరాడు మూర్తి. వెళ్ళవలసిన నాలుగైదు చోట్లకూ వెళ్ళి యింటికి తిరిగివస్తూ గడియారం చూసుకున్నాడు. గంట పదకొండు. భోజనానికి యింకా కొంత వ్యవధి లేకపోలేదు. దారిలోనే తగులుతుంది మేష్టరుగారి యిల్లు. పెద్దమ్మకు అచ్చంగా జబ్బులాంటిదేదీ లేకపోయినా దానికి సంబంధించిన అనుమానాలు దండిగా ఉన్నాయి. వాటిని గురించామె చెప్పడానికైనా, తాను వినడానికైనా మేష్టరుగారి సాన్నిధ్యంలో బొత్తిగా వీలుండదు. పనిలో పనిగా ఆమెనుగూడా పలకరించుకుని వెళ్ళిపోతే అదనంగా యింకొక పనిగూడా ముగిసినట్టవుతుంది.

"ఏం చేస్తున్నారు పెద్దమ్మగారూ! దారిన వెళ్తూ యిలా వచ్చాను. పది రోజులప్పుడు నేనిచ్చిపోయిన మందు ఎలా పనిచేసిందో చెప్పారుగారు" అంటూ కుర్చీలో కూర్చున్నాడు మూర్తి.

"అయ్యో, మతిమరుపా! చెప్పాను కానా మూర్తీ? పది రోజులకని చెప్పావుగదూ! మందు తియ్యగా ఉందేమో, మూడు రోజులకే బాటిలు ఖాళీ అయిపోయింది. చెబితే నువ్వేమనుకుంటావోనని గమ్మున వుండిపోయాను..."

పెద్దమ్మలో యింకా పసితనం మాసిపోనందుకు లోలోపలే నవ్వుకున్నాడు మూర్తి.

"ఐనా నీ అక్కరకొద్దీ నువ్వేదో మంది లిస్తున్నావుగాని, పుచ్చుకుంటున్నానని తెలిస్తే నీ మేష్టరుగారు మండిపడతాడు. నీరసంగా ఉంది అంటాననుకో – వెళ్ళి భోజనం

చేయమంటారు. చెమటలు పోస్తున్నాయంటాననుకో - స్నానం చేయమంటారు. నిద్ర లేదంటాననుకో - కాసేపేదైనా చదువుకోమంటారు. అంతేగాని దీనికేదైనా మందో మాకో చూడాలన్న ధ్యాసే ఉండదాయనకు..."

"మితిమీరిన నీరసం, మాటిమాటికి చెమటలు పట్టడం, రాత్రిళ్ళు నిద్రలేకపోవటం యివన్నీ అనారోగ్య లక్షణాలు. ఈ చిన్నెలు పొడచూపినప్పుడు జాగ్రత్త వహించడం మంచిది. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం పనికిరాదు" అన్నాడు మూర్తి.

"ఒక్కసారా, రెండుసార్లా మూర్తీ! లక్షసార్లు చెప్పి ఉంటాను. చెబితే వినే రకమా! వద్దు వద్దని చెబుతున్నా సరే, తమ ధోరణే తమది! ఉదయం అయిదు గంటలకే నిద్రలేస్తారు. పందు చలిగా ఉన్నా, జడివానలా మంచు కురుస్తున్నా బయటికి వెళ్ళి భళ్ళుమని తెల్లవారాక యింటికి తిరిగొస్తారు. ఎనిమిది గంటలకు ఓ గ్లాసుడు పాలు త్రాగితే, మళ్ళీ పన్నెండుకు పైనే భోజనం. సాయంకాలం టిఫినుచేసి పెడతానంటే, ససేమిరా వద్దంటారు. ఎందుకని నిలదీసి అడిగితే ఏదుఏడున్నరకల్లా ఏకంగా భోజనమే చేయవచ్చును గదా, మళ్ళీ మధ్యలో టిఫిను దేనికని ఎదురు రెట్టిస్తారు..."

"ఆ రెండు పూటలైనా ఆయన తృప్తిగా తింటున్నారా అన్నదే నా సందేహం!" ఆరోగ్యానికి మూలకారణాలను ఆరాతీసే ప్రయత్నంలో ఉన్నాడు మూర్తి.

"అయ్యో రాతా! ఆ మాటెందుకులే మూర్తీ! ఇది బాగుంది. ఇది బాగా లేదు అన్నమాటే లేదు. చేసిపెట్టిందల్లా శుభ్రంగా తినేయడమే! అదేమిటని అడిగితే ఆకలికి రుచేం తెలుస్తుందని ఒకటే నవ్వు..."

ఆరోగ్యాన్ని కొలవడానికి ఉపకరించే బెరామీటర్లు రెండు. మొదటిది ఆహారం. రెండోది నిద్ర. బాగా ఆకలివేస్తే, సుఖంగా నిద్రపడితే - ఆ పరిస్థితిలో ఆరోగ్యం ధోకా లేకుండా ఉందన్న మాటే! జఠరాగ్ని ప్రకోపం జాజ్జ్వల్యమానంగా ఉన్నట్టయితే ఆరోగ్యం సగం మేరకే నిక్షేపంగా ఉందనే చెప్పవచ్చు. మిగిలిన సగం సంగతి?

"తొమ్మిదిన్నర అయినా కాకమునుపే నేను వెళ్ళిపోతుంటానా పెద్దమ్మగారూ! ఆ తరువాతగూడా చాలాసేపు చదువుతూ కూర్చుంటారా మేష్టరుగారు? అర్ధరాత్రి దాటందే పడుకోరా." ప్రశ్నించాడు మూర్తి.

"బాగా చెప్పావులే మూర్తీ! గంట పది కొట్టడమే ఆలస్యం. మేష్టరుగారి విషయంలో పడుకోవడం వేరు, నిద్రపట్టడం వేరు కావు. పడుకోవడమంటే నిద్రపట్టిందన్నమాటే!"

ఏవో వివరాలైతే తెలిశాయిగాని అసలు విషయం మాత్రం దొరికింది గాదు.

డాక్టరుగారి సైకిల్ మళ్ళీ పురవీధుల వెంట బయల్దేరింది. మార్గమధ్యంలో శంకరశాస్త్రిగారు ఎదురయ్యారు. బిగ్గరగా కేకబెట్టి ఆయన మూర్తిని సైకిలునుంచి క్రిందికి దింపించారు.

"అదేమిటోయ్ మూర్తీ! చిన్ననాటి గురువుని! డాక్టర్లకు చిరకాల మిత్రుణ్ణి! నిరంతర వైద్యశాస్త్ర ప్రయోగాలకు ఎడతెగని ముడివస్తువుని! నన్ను పలకరించకుండా వెళ్ళిపోవడం న్యాయమా?" నిలదీసి అడిగారాయన.

"అబ్బే! నేను మీవైపు చూడ్డం తటస్థించలేదండీ మేష్టరుగారూ! సెలవులో ఉన్నారేమిటి?"

"ఆ మాటెందుకులే మూర్తీ! కాజువల్ లీవులు, ప్రివిలేజిలీవులు జూనుకే అయిపోయాయి. సిక్‌లీవుగూడా గడువు మీరిందని లాస్ ఆఫ్ పే చేస్తామంటున్నారు. సింహాద్రి డాక్టరుకు రెస్టు రెస్టనడం పరిపాటి. రెస్టువల్ల నాకు కలిగే నష్టం సంగతి ఆయన ఆలోచించడు. అప్పటికీ హెడ్మాస్టరుగారు మంచివారు గనుక నా ఆటలు సాగుతున్నాయి..."

"అన్నట్టు హెడ్మాస్టరుగారి కెప్పుడూ ఇలాంటి సెలవుల్ని వాడుకునే అవసరం తగలదా మేష్టరుగారూ?" కుతూహలంతో అడిగాడు మూర్తి.

"ఆయనా! ఆయనకు సెలవులెందుకు? ఆదివారంనాడు తప్పనిసరిగా బడి మూసేయవలసి ఉంటుందనే ఆయనకు విచారం! ఇంచుమించుగా నేనూ ఆయనతో బాటుగానే సర్వీసులో చేరానా మూర్తీ! ఆనాటినుంచీ చూస్తున్నాను. ఒళ్ళు నలతగా ఉందన్న కారణంతో ఓ అరరోజు సెలవుపెట్టిన పాపానపోయాడు కాదు మహానుభావుడు! ఏ అమ్మగన్న బిడ్డో, ఏ అమృతరసాయనం సేవించాడో, దినదినప్రవర్ధమానమైన ఆయన ఆరోగ్యభాగ్యానికి వెనుకనున్న కిటుకేమిటో..."

అర్ధోక్తిలో ఆగిపోయారు శాస్త్రిగారు. మూర్తికిగూడా ఆ క్షణాన అనివార్యంగా ఓ సందేహం కలిగినమాట నిజం! హెడ్మాస్టరుగారన్న పేరుతో వ్యవహరించబడుతున్న ఈ వ్యక్తి నిజంగా ఓ మనిషేనా, కాకపోతే నియమబద్ధంగా పనిచేస్తున్న ఒక యంత్రమా అని! మనిషైతే ఒకప్పుడు గాకపోయినా ఒకప్పుడు రోగాలకు రొస్టులకు లోనుగావడం సహజం! మరలు విరిగిపోవడంవలన, బిస చెడిపోవడంవల్ల ఒక్కొక్కప్పుడు యంత్రమైనా దారితప్పడం కద్దు! మేష్టరుగారు రెంటికీ చెడిన రేవడిలా ఉన్నారు!

అన్వేషణకు ఫలితం ఒక అసందిగ్ధమైన నిర్ణయానికి చేరుకోలేకపోయాడు మూర్తి. భాగ్యలక్ష్మికి మల్లే ఆరోగ్యలక్ష్మికూడా అకారణంగానే కొందరిని అనుగ్రహిస్తుందేమో! మరి కొంతమంది ఎంతగా వేడుకొన్నా దగ్గరికి రాక దవుదవ్వులనే ఉండిపోతుందేమో...

***

విజ్ఞానం అంతులేనిది. తృష్ణ అంతకన్నా అంతులేనిది. ఆ రెండూ కలిస్తే ఒకరు చెప్పేదేముంది? జ్ఞానతృష్ణ పూర్తిగా ఉపశమించడానికి కొన్ని ఆయుష్కాలాలైనా చాలకపోవచ్చు.

నాలుగేళ్ళ శాస్త్రాధ్యయనంతోనూ, ఒకటి రెండేళ్ళ అనుభవంతోనూ మూర్తికి సంతృప్తి కలిగింది కాదు. శస్త్రచికిత్సపైన క్రొత్తగా కనుగొన్న విశేషాలను అభ్యసించే నిమిత్తం ఉత్తరదేశం వెళ్ళి రెండేళ్ళ ఒప్పందంపైన అక్కడొక మిషనరీల ఆసుపత్రిలో అతడు ఉద్యోగానికి కుదిరాడు. నిపుణులైన వైద్యులు, క్రొంగ్రొత్త చికిత్సా విధానాలు, ఆధునికమైన ఉపకరణాలు, అన్నింటినీ మించి వైద్య శాస్త్రంలో ఏ ప్రయోగం చేయాలన్నా అందుకనువుగా లభ్యమయ్యే జబ్బులు, అంతా బాగానే ఉందిగాని ఎందుకో తన హృదయంలో అశాంతి చోటు చేసుకుంటున్నట్టు తోచింది మూర్తికి! బహుశా వూరు విడిచి దూర ప్రాంతానికి తరలి రావడమే అందుకు కారణం గావచ్చు. ఐనా ఈ ప్రవాస జీవితం ఎంతకాలం! ఇలా చూస్తుండగానే రెండేళ్ళు గడచిపోవూ? కార్యసాధకుడు కష్టాన్నిగానీ సుఖాన్నిగానీ లెక్కకు రానీయడని భర్తృహరి చెప్పనే చెప్పాడుకదా!

రెండేళ్ళ శిక్షణ కాలంలో ఆరుమాసాలు గడిచిన తరువాత ఓరోజు రాత్రి మలిజాము వేళ వాలుకుర్చీలో కూర్చుని ఆనాటి టపాలో వచ్చిన దినపత్రిక చదువుకుంటున్నాడు మూర్తి. పతాక శీర్షికలో నదీజలాల తగాదాను పరికించి, రెండో పేజీలో క్రీడా విశేషాలను గమనించి, మూడో పేజీలోనికి వచ్చేసరికి తనకోసం కాచుకుని ఉన్న మహత్తరమైన వార్త ఒకటి మూర్తికక్కడ దృగ్గోచరమైంది. రెండు కాలములమేరకు విస్తరించిన ఆ వార్త కనుబంధంగా ఓ ఛాయాచిత్రంకూడా ప్రచురింపబడింది. రాష్ట్రపతి దగ్గరనుంచి ఓ ఉపాధ్యాయుడు బహుమానం అందుకుంటున్న దృశ్యం. జాతీయ గౌరవానికి పాత్రుడైన ఆ ఉపాధ్యాయుణ్ణి మొదటి చూపులోనే పోల్చుకోగలిగాడు మూర్తి. వెంటనే వార్తను సాకల్యంగా చదివేశాడు. విద్యాబోధనకు జీవితాన్ని అంకితం చేసి ఆ రంగంలో దేశానికి గొప్ప సేవచేసిన ఆచార్యులను జాతీయ స్థాయిలో గౌరవించడం ఇటీవలి సాంప్రదాయం. ఈ ఏడు ఆ విధంగా గౌరవింపబడిన నలువది మంది ఉపాధ్యాయుల్లో నారాయణరావు గారొకరు. వార్త క్రింద సంగ్రహంగా జీవిత విశేషాలను పొందుపరచడం గూడా జరిగింది. ఒకే పాఠశాలలో ముప్పై ఏళ్ళ సర్వీసు. బడిని గుడిగా దిద్దితీర్చిన కార్యదీక్ష. ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా నీతిపథంనుంచీ తప్పి నడవని అసిధారావ్రతం. ఇంకా సంఘసేవ కార్యక్రమాలు...

ఐదు నిముషాలవరకూ కళ్ళు మూసుకుని నిశ్చలంగా కూర్చున్నాడు మూర్తి. అంతసేపూ అతడొక రకమైన తన్మయత్వాన్నే భజించాడు... న్యూఢిల్లీ నగరం. రాష్ట్రపతి భవనం. సభాసీనులైన పెద్దల సమక్షాన సన్మానం. పోగా చిరకాలంనుంచి తనను వెంటాడుతూ వచ్చిన ఓ ధర్మసందేహంనుంచి విముక్తి పొందినట్లుగా మనసు తేలిక పడిందిగూడా! ఇది మానవ సామ్రాజ్యంపైన యాంత్రిక నాగరికత పెత్తనం చలాయిస్తున్న కాలం. నిజమైన పనితనంతో గాకుండా పోజులుపెట్టి డాబులుకొట్టి పబ్బం గడుపుక పోవడానికి వీలున్న రోజులు. జీవితకాలంలోనూ, జీవశక్తిలోనూ ఎక్కువ భాగాన్ని ఒక సంస్థకు, లేదా ఒక సత్కార్యానికి ధారబోసిన వ్యక్తులకు పరిగణన లభించదేమోనన్నదే తన సందేహం! ఆ సందేహం వట్టి సందేహమేననీ, సిద్ధాంతంకాదనీ తేలిపోయింది.

అప్పటికప్పుడు తన ఆనందాన్ని ఉత్తరంలో యిమిడ్చిన తర్వాతగాని మూర్తికి నిద్ర పట్టిందిగాదు. తోటలో పువ్వులు పూస్తే వాటిలో భగవంతుడి కైంకర్యంలో చరితార్థత పొందేవి కొన్ని. భామినుల కేశపాశాలకు అలంకారంగా చెన్నుమీరేవి కొన్ని. పరిమళ ద్రవ్యాల తయారీకి ఉపకరించేవి కొన్ని. ఆకులు రాలని, పూలు వాడని సంసదారామం లాంటిది విద్యాలయం. విద్యార్థులు పువ్వులు, ఉపాధ్యాయుడే తోటమాలి. అబ్బో! ఎందరు శిష్యులు మేష్టరుగారికి! విదేశాల్లో ఉన్నతోద్యోగులుగా కొందరు. మంచుకొండ శిఖరాల్లో మాతృదేశ రక్షణార్థమై దీక్షాకంకణులై కొందరు. దారిద్ర్య నిర్మూలనంకోసం నదీజలాలకు ఆనకట్టలు కట్టే బృహత్కార్యాల్లో నిమగ్నులై కొందరు. ఇంకా తనలాంటి డాక్టర్లు, కార్మికులు, గుమస్తాలు – వేల సంఖ్యలో ఉన్న శిష్యులకింతకంటే శుభ వర్తమానం మరేముంటుంది? వందలకొలది అభినందన లేఖల్లో తనదీ ఒకటి–

మరునాటినుంచి మరింత శ్రద్ధగా దినపత్రికను గమనింపసాగాడు మూర్తి. ఏ వార్తలకోసమైతే తానెదురు చూచాడో అవి ఒకరోజు గాకపోతే మరొకరోజు, విపులంగా గాకపోతే టూకీగానైనా కనిపించేవి. ముఖ్యంగా చెప్పుకోదగినది పురపాలక సంఘంవారు మేష్టరుగారికి చేసిన పౌరసన్మానం. అంతకుమునుపు ఆయన రాజధానినుంచి తిరిగివచ్చిన సందర్భంలో జరిగిన ఊరేగింపుకూడా గణనీయమైనదే! దారి పొడుగునా మేళతాళాలతో, పుష్పవర్షంతో, విద్యార్థుల కోలాహలంతో సాయంకాలం ఆరుగంటలప్పుడు స్టేషను దగ్గర ప్రారంభమైన ఊరేగింపు మేష్టరుగారిల్లు చేరుకునేసరికి రాత్రి పది గంటలు కావచ్చింది. మరునాడు పాత విద్యార్థుల సంఘంవారు పట్టు శాలువాలు కప్పి, రజత శారదా విగ్రహాన్ని బహూకరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరుగారు మేష్టరుగారికి ఆ గౌరవం లభించడంలో ఉన్న ఔచిత్యాన్ని గురించి నాలుగు మాటలు చెప్పారు– "మానవుడికి ఘనత నాపాదించే హంగులు చాలా వున్నాయి. మొదటిది డబ్బు. లాటరీలో లక్షరూపాయలు రావచ్చు. అవినీతే ప్రాతిపదికగా అంత మొత్తం గడించవచ్చు. అలాకాకుండా న్యాయానికి సేగిలేని పద్ధతిలో లక్ష రూపాయలు గడించడంలో విశిష్టత ఉందని చెబితే అందుకభ్యంతరం చెప్పేవాళ్లుండరు. మేష్టరుగారికి కీర్తి లాటరీలో వచ్చిన ప్రైజుగాదు. కనుకట్టుతో, మంత్రతంత్రాలతో సంపాదించిందిగాదు. వెనుక ముప్పదేళ్ళ నిర్విరామ కృషి ఉందనే ఉంది."

మూర్తి మరికొంత దూరం ఆలోచించాడు – నిజమే! సేవ, త్యాగం, ఉపకార పారీణత మొదలైన సద్గుణాలవల్ల జేబులు నిండవు. కీర్తి మాత్రమే లభిస్తుంది. అదికూడా లభించకపోతే ఇక లోకంలో సదుద్యమాలకు తావే ఉండదేమో!

మూడు మాసాలవరకు పత్రికలో అడపాదడపా సన్మాన వార్తలు చూస్తూ వచ్చాడు మూర్తి. బడిలోని పిల్లలందరూ కలిసి ఒకసారి, ఉపాధ్యాయులందరూ ఒకసారి మేష్టరుగారిని సన్మానించారు. జిల్లాలోని పేరెన్నికగన్న పాఠశాలలు ఆయన్ను పిలిపించుకుని విందులిచ్చి వేనోళ్ళ ప్రశంసలు కురిపించి తమవంతు తామూ చెల్లించుకున్నాయి. ఎటొచ్చీ మూర్తికొక్కటే కొరత. ఆ ఆనందంలో తను పాలు పంచుకోడానికి వీల్లేకపోయింది. ఉత్సాహ సంబరంలో ఉండిపోయారేమో, మేష్టరుగారు తన జాబుకు బదులుగూడా వ్రాశారు కారు.

అక్కడ తన జాబుకు జవాబు రానందుకు మూర్తి కించపడడము, యిక్కడ రావుగారు అతని జాబుకు బదులు వ్రాయడము రెండూ బహుశా ఒక్క సమయాన్నే జరిగి ఉండవచ్చు. మూడోనాటి సాయంకాలం టపాలో మూర్తి ప్రత్యుత్తరం అందుకున్నాడు. ఒకటికి రెండుసార్లు చదివాడు. చదువుతూ అది మేష్టరుగారు తనకు వ్రాసిన ఉత్తరం కాదేమో ననుకున్నాడు. కాకపోతే మేష్టరుగారికి అనారోగ్యమా! అందులోనూ తీవ్రమైన అనారోగ్యం! పాఠశాలకు రెండు నెలలు సెలవు పెట్టవలసిన అనారోగ్యం! ఇలా జరగవచ్చునని తను కలలోనైనా అనుకోలేదు...

విచ్చిపోయిన దుర్గంలోనికి శత్రువులు చొచ్చుకుని వచ్చినట్టుగా మేష్టరుగారి ప్రశాంత జీవనంలోకి అనారోగ్యం ఎలా ప్రవేశించినట్టు? ఎలా ప్రవేశించిందో గాని

ఉత్తరంలో ముప్పాతికా మువ్వీసంవంతు దాని వర్ణనతోనే సరిపోయింది. ఎంతోకాలం సాధన చేస్తేగాని భక్తుడికి భగవంతుడిపైన ఏకాగ్రత కుదరదు. రోగి సంగతలా కాదు. రోగి ధ్యాసంతా రోగంపైకి మళ్ళడానికి ఎంతటి స్వల్ప కాలమైనా చాలు...

మూడో పర్యాయం ఉత్తరం చదువుకున్నాడు మూర్తి.

"తన సంతోషమే స్వర్గము, తన దుఃఖమే నరకమన్న ఆర్యోక్తిని ఎరుగుదువా మూర్తీ! ఆ మాటల్లో ఎంతో నిజం ఉంది. నువ్వు కాన్సరంటావు. టి.బి అంటావు. అదంటావు, ఇదంటావు. కాని అవన్నీ నా జబ్బు ముందు దిగదుడుపుకైనా పనికిరావని నేననుకుంటాను. డాక్టర్లతో సంప్రదించడం మూడు మాసాల క్రిందటే ప్రారంభమైంది. ఆ ప్రారంభం ఏ దుర్ముహూర్తాన జరిగిందోగాని నాటినుంచీ నేటి వరకూ ఈ వ్యాధి రోజుకొక విచిత్ర వినూత్న పరిణామంతో నన్ను వేధించుకతింటోంది. కొంతసేపు కుర్చీలో కూర్చుంటే వెన్నెముకలోపలి భాగాన సూదులతో పొడిచినట్లుగా బాధగా ఉంటుంది. అరమైలు దూరం నడిస్తేసరి బడలికవల్ల ఎక్కడ బడితే అక్కడ కూలబడి పోదామనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఎందుకో హఠాత్తుగా తలనొప్పి తరుముకొచ్చేస్తుంది. రైలు రానున్నందుకు గుర్తుగా రెక్కమాను వంగడంలేదా మూర్తీ! ఆ మాదిరిగా నొప్పి రావడానికి ముందుగా పట్టుకారుతో బిగనొక్కినట్టుగా తల ఇనుపగుండులా స్తబ్ధమై పోతుంది. ఇవి మాత్రమేగాదు. ఈ అవలక్షణాలన్నింటికీ తలమానికమైనది వేరొకటుంది. నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో మునుపెన్నడూ నాకు ప్రమేయం ఉండేది గాదు. ఇప్పుడలాకాదు. ఎడమవైపు శ్వాస బరువెక్కినట్టు తోస్తుంది. ఒకప్పుడు ప్రయత్న పూర్వకంగాగానీ వూపిరాడదు...

ఉత్తరం పూర్తిగాక మునుపే మూర్తి ఆలోచనలన్నీ ఒక్కసారిగా వైద్యశాస్త్ర వీథుల వెంట పరవళ్లు ద్రొక్కసాగాయి. ఈ అనారోగ్య లక్షణాలకు హేతువైన జబ్బులు నాలుగైదున్నాయి. సామాన్యులైన వైద్యులు ఆ నాలుగైదింటినీ ఒక్కటే పేరుతో వ్యవహరిస్తారు. శాస్త్ర సాంప్రదాయరీత్యా ఆంగ్లంలో దానిపేరు పల్నాడు చేంత్రాటితో పోటీ పడదగినంత పెద్దది. తెలుగులో ముక్తసరిగా నరాల నిస్సత్తువ అని పేర్కొనవచ్చు.

మళ్ళీ ఉత్తరంలో పడ్డాడు మూర్తి.

"మీ పెద్దమ్మదొకటే గోల! నేను తగు జాగ్రత్త వహించడం లేదని! ఆమె ఉద్దేశంలో జాగ్రత్త అంటే ఏమిటో నాకర్థం గాదు. లోకంలో ఎన్నో వైద్యశాలలున్నాయి. తీరు తెన్నులనుబట్టి చూస్తే అవి రోగాలకు నిలయాలనుకోడానికి మనసొప్పదు. అక్కడ రోగ దేవతకు జరిగే పరిచర్య గూడా ఎంతో ఖరీదుతో కూడుకున్నది. పోగా నిష్కర్షగా ఇంతకాలంలో జబ్బు నయమైపోతుందన్న పూచీ ఏమీ ఉండదు. ఈ పరిస్థితిలో రోజుకు పాతిక రూపాయల చొప్పున వెచ్చిస్తూ ఆసుపత్రుల్లో ఉండగల స్తోమతు నాకు లేదు. లేదని చెబితే మీ పెద్దమ్మ ఒప్పుకోదు. చెవిలో ఇల్లు గట్టుకుని సరిపోరుతుంది. రోగమే ఒక బాధ కాగా నా పాలిట కిదొక అదనపు బాధగా పరిణమించింది. డాక్టరు సింహాద్రిగా రుండనే ఉన్నారు. ఆయుర్వేద వైద్యులు అప్పల నరసయ్యగారు వారానికొకటి రెండుసార్లు వచ్చి చూచిపోతున్నారు. ఇక్కడి గవర్నమెంటు ఆసుపత్రికి కనకాచలమని క్రొత్త డాక్టరు వచ్చాడు. నా యీ జబ్బు నయం చేయాలన్న శ్రద్ధ, పట్టుదలా పై ముగ్గురిలోనూ ఒకటే

సమాన నిష్పత్తిలో ఉందని నా నమ్మకం; కాని, మీ పెద్దమ్మ అలా అనుకోదు. ఆమె నమ్మకం ఇరుగింటివాళ్ళు, పొరుగింటివాళ్ళు, బంధువులు, మిత్రులు మొదలైన శ్రేయోభిలాషుల సలహా మేరకు దేశంలో ఎందరెందరు ఘనవైద్యులైతే ఉన్నారో, వాళ్ళందరిపైకీ శాఖాచంక్రమణం చేస్తుంది. అలాంటి అసంఖ్యాకులైన వైద్యుల్లో నువ్వొ ఒక్కడివి. ఆమె దృష్టిలో నీకొక్క అదనపు క్వాలిఫికేషనుకూడా ఉంది - నువ్వు నా శిష్యుడవని!"

ఉత్తరాన్ని టేబిలుపైకి విసిరాడు మూర్తి. చివాలున పైకి లేచాడు. పెద్దమ్మ కంగారు పడడంవల్ల నైతేనేమి పరామర్శించే డాక్టర్ల సంఖ్య హెచ్చడంవల్లనైతేనేమి, మేష్టరుగారికి యిదేదో తీవ్రమైన జబ్బన్న అనుమానం కలిగినట్టుంది! ఒకవేళ ఇది తీవ్రమైన జబ్బే ననుకుందాం. దివ్యౌషధాలున్నాయిగదా! ముసలి డాక్టర్లకు పాతవాటి పైనేగానీ కొత్త మందులపైన విశ్వాసముండదు. ఒక ఆయుర్వేద వైద్యుడి దృష్టిలో ఆయుర్వేదమే వైద్యం. వాళ్ళు క్రొత్త క్రొత్త వైద్య గ్రంథాలను చదువరు. క్రొత్త మందులను ఉపయోగించి వాటి ఫలితాలను గమనించరు. కాకపోతే ఒకరికి ముగ్గురు డాక్టర్లు చికిత్స చేసినా మేష్టరుగారి జబ్బు నయం కాలేదంటే అర్థమేమిటి? వాళ్లు దగ్గరుండీ చేయలేని పనిని యింత దూరంనుంచీ పట్టుమని పదిరోజుల్లో చేసి చూపడం తన చేతనౌను.

మరునాడు మూర్తి దగ్గరనుంచి రావుగారికొక మందుల పార్సెలు వెళ్ళింది. ఔషధ సేవనం జరుగుతోందనీ, గుణం కనిపిస్తూనే ఉందనీ మేష్టరుగారు బదులుకూడా వ్రాశారు.

ఆ జాబును పదిమంది డాక్టర్లకు చూపించాడు మూర్తి. వాళ్ళు పదిమందీ పదిరకాల సూచనలు చేయగా వాటినన్నిటినీ తాను మథించగా, అప్పుడు స్ఫురించిన క్రొత్త మందులను జతచేసి మేష్టరుగారికి మళ్ళీ ఒక మందుల పార్సెలు రవాణా చేశాడు.

నెల రోజులు గడిచిపోయాయి.

రావుగారి దగ్గరనుంచీ మూడో ఉత్తరంకూడా వచ్చింది. జబ్బు నయం కావస్తోందని! తనకేవిధంగా కృతజ్ఞత తెల్పుకోవాలో తోచడంలేదట!

***

శిక్షణాకాలం పూర్తయి స్వస్థలానికి మరలివచ్చిన మూర్తి వారం రోజులు హాయిగా విశ్రాంతి తీసుకున్న తరువాత మళ్ళీ బోర్డు తగిలించి డిస్పెన్సరీ తెరిచాడు. ఆలోగా పట్టణంలో తాను కలుసుకోదగిన పెద్దలనందరినీ కలుసుకున్నాడు. ఆ వారం రోజుల్లో అతడు ఒకరోజు రోజంతా మేష్టరుగారి యింటిదగ్గరే గడపవలసి వచ్చింది. పుట్టింటికి వచ్చిన ఆడుపడుచుకు జరిగినట్టుగా మూర్తికక్కడ రాజోపచారాలు జరిగాయి. "ఏం చెప్పమంటావు మూర్తీ! గడచిన అయిదారు నెలలుగా మేము మనుషులమే కామనుకో! అంతగా బెంబేలు పడిపోయాము. చివరికెలాగైతేనేం, కొండలా వచ్చిన ఆపద మంచులా కరిగిపోయింది. అంతా భగవంతుడి కృప" అంది శ్రీదేవమ్మ.

మూర్తి మనస్సు చివుక్కుమన్న మాట నిజం! ఎంతోకొంత మానవ ప్రయత్నం స్పష్టంగా కళ్ళకు కనిపిస్తుండగా అంతా భగవంతుడి కృపే ననుకోడం ఏం సబబు? ఆ మాటకొస్తే దృగ్గోచరమయ్యేదొక్క మానవ ప్రయత్నమేగదా! భగవంతుని కృప అన్నదొకటి

ఉందో లేదో ఎవ్వడెరుగును? లేదంటే ఇందులోని అంతరార్థాన్ని ఈ విధంగా విడమరిచి చెప్పుకోవచ్చు- అవసరానికి కెంతగా ఆదుకున్నా డాక్టర్లు మానవమాత్రులు మాత్రం గాకపోరు. ఆరోగ్యం చెడిన రోజుల్లో వైద్యుడే నారాయణుడుగా కనిపిస్తే కనిపించవచ్చు. కాని, ఆ తరువాత డాక్టరుతో అవసరముండదు. రానూ వచ్చి, పోనూ పోయిన జబ్బు మళ్ళీ రాకుండా ఉండాలనుకోడం మానవ స్వభావం. ఈ కోరిక నెరవేరడానికి డాక్టరు తోడ్పాటుకన్నా భగవంతుడి కృపే అవసరమేమో!

ఆ విధంగా ఎదుటివారి ధోరణికి తనకు తోచిన వ్యాఖ్యానం చెప్పుకున్నాడు మూర్తి. కానైతే యిందులో తన ఊహకు మించిన నిజాలు ఉండగలవన్న ఊహ అతడికి లీలగానైనా స్ఫురించిందిగాదు. పదిరోజుల తర్వాత డాక్టరు సింహాద్రిగారితో మాట్లాడు తుండగా విషయం బయటపడింది.

"రెండేళ్ళుగా నువ్వు ఊళ్ళో లేకపోయావా మూర్తీ! నువ్వుంటే నాకు కాస్త రిలీఫ్ ఉండేది. ఎందుకులే, నా అవస్థ ఆ దేవుడికే ఎరుక! తిండి తినడానికైనా తీరికుండేదిగాదు. ప్రతిరోజూ పది పదిహేను చోట్లకు వెళ్ళవలసి వచ్చేది. మిగిలినవన్నీ ఒక ఎత్తయితే హెడ్మాష్టరుగారి కేసు ఒక ఎత్తు. వచ్చిన చిక్కు ఆయనతోగాదు. ఆయన భార్యకు ధైర్యం చెప్పేసరికి తలప్రాణం తోక కొచ్చినంత పనయ్యేది. ఎలాగైతేనేం, ఆ జబ్బును నయం చేసేశాను - ఊపిరి త్రిప్పుకోగలిగాను..."

"మీరు నయం చేశారా?" అప్రయత్నంగా ప్రశ్నించాడు మూర్తి.

"మరి? ఈ మధ్య నువ్వు అప్పల నరసయ్యను కలిశావా ఏమిటి మూర్తీ! అదేదో సింధూరమట! దాంతో ఆ రోగం నయమై పోయిందని అతగాడు గొప్పలు చెప్పు కుంటున్నాడట! నాతో చాలామంది చెప్పారు..."

"అబ్బే, అప్పల నరసయ్యగాదు..."

"మరైతే డాక్టరు కనకాచలమై ఉంటాడు. ఏమైనా అతడి నిజాయితీ మాత్రం మెచ్చుకోదగ్గది. చాటునా మాటునా గాకుండా నా ముఖాన్నే చెప్పేశాడు - హెడ్మాస్టరుగారికి జబ్బు నయం చేసిన ఘనత తనకే దక్కాలని! ఆ మాటమీద మాకు జటాబొటీ జరగడంగూడా జరిగింది..."

అంతపనికి సిద్ధంగా లేడు మూర్తి. పైగా సత్యాన్ని తేల్చుకోడానికి ద్వంద్వయుద్ధమే సజావైన పద్ధతన్న సూత్రంపట్ల అతడికి నమ్మకంగూడా లేదు. అతడు మెల్లగా పైకి లేచి నేరుగా కథారంగానికే దారి తీశాడు.

వెళ్ళిన సమయానికి రావుగారింట్లో లేరు.

"కూర్చో మూర్తీ! ఆరోగ్యం కుదిరిందిగా, అయ్యగారింట్లో లేరు. షికారుకు వెళ్ళినట్టున్నారు. వచ్చేస్తారు కూర్చో" అంది శ్రీదేవమ్మ.

పది నిమిషాలసేపు ఆ మాటా యీ మాటా మాట్లాడి అసలు విషయంలోకి వచ్చేశాడు మూర్తి.

అంతా విన్నాక పెద్దమ్మగూడా అయోమయమైన అభిప్రాయాన్నే వెలిబుచ్చింది. నిజానికి తమకుగూడా అంతుబట్టని రహస్యం అదేనట! వాడడానికైతే అందరి మందులూ

వాడడం జరిగిందట! వాటిలో ఎవరి మందువల్ల ఆరోగ్యం కుదిరిందోగాని, అది తమ పాలిటకొక ధర్మసందేహమైపోయిందట!

అప్పుడిక తాను పంపిన మందుల ప్రాశస్త్యాన్ని గురించి ఉగ్గడించక తప్పిందిగాదు మూర్తికి!

"ఉండుండు మూర్తీ! మనలో మనకు సందేహాలెందుకు? అలమారా తెరిచి చూస్తే సరిపోదూ!"

తలుపులు తెరిచింది శ్రీదేవమ్మ. అలమారా చిన్నసైజు మందులంగడిలా ఉంది. అరల నిండుకూ రకరకాల మందుల సీసాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ డబ్బీలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని సీసాలకు వేసిన సీలు వేసినట్టే ఉంది. మిగిలిన వాటిలో ఒకటి రెండు ఔన్సుల మేరకు ఖాళీ అయివున్న సీసాల సంఖ్యే హెచ్చు. సూది మందులు కొన్ని ఆలనా పాలనా లేకుండా ఒకదానిపైన ఒకటి పడి ఉన్నాయి. అన్నింటిలోనూ తాను పంపిన ఔషధాల ఆచూకీకోసం తీవ్రంగా పరిశీలించి చూడసాగాడు మూర్తి. క్రింది అరలో పార్సెలు కనిపించింది. అది తను రెండోసారి పంపిన పార్సెలు! మందపు కాగితాల దిగ్బంధనంతో, బిగదీసికట్టిన నూలు దారాలతో, ఆఖరుకు లక్క సీళ్ళతో సహా అది తనెలాగైతే పంపాడో అలాగే సురక్షితంగా ఉంది!

మూర్తి నిర్విణ్ణుడైపోయాడు. మేష్టరుగారు జబ్బునుంచి కోలుకున్నారు. ఆ కోలుకోడానికి హేతుభూతుడైన వైద్యుడెవరో ఆయనకు తెలిసి ఉండకపోదు. మరైతే ఈయన వరసగా డాక్టర్ల నందరినీ మభ్యపెట్టి ఇలా కపట నాటకం ఆడవలసిన అవసరం ఏమై ఉంటుంది?

శ్రీదేవమ్మ ఏమిటో మాట్లాడుతోంది. ఆ మాటలేవీ మూర్తి బుర్రకెక్కడంలేదు. మేష్టరుగారు చడీచప్పుడూ లేకుండా ఎప్పుడో వచ్చారు. వచ్చి మూర్తి కెదురుగా కుర్చీలో కూర్చున్నారు.

"వచ్చేశారా! ఆలస్యంగాకుండా సమయానికే వచ్చారు. ఎందుకంటారా! మూర్తికొక టెంకాయ దొరికింది. దాన్ని పగలగొట్టాలంటే ఇందాకటి వరకూ రాయే కనిపించింది గాదు..."

"ఇప్పుడు కనిపించిందన్నమాట!"... రావుగారు తెరచిఉన్న అలమారా వైపు చూశారు. కొశ్చన్‌మార్కులా ఉన్న మూర్తి ముఖంలోకి చూచారు. అంతకుమునుపు ద్వారంలో అడుగుపెట్టినప్పటినుంచి హాల్లోకి వచ్చేదాకా ధారాపాతంగా వినవచ్చిన శ్రీదేవమ్మ ప్రసంగంనుంచి ఆయన అసలు విషయం గ్రహించే ఉన్నారు.

"చూడు మిస్టర్ మూర్తీ! ఈ ప్రపంచం ఎలా సృష్టింపబడిందన్న ప్రశ్నను నువ్వు జీవితంలో వందసార్లయినా విని ఉంటావు. అన్నిసార్లు దాన్ని గురించి ఆలోచించిగూడా ఉంటావు. పైకి చూడ్డానికి అది చాలా మామూలు ప్రశ్న. కాని ఒక పట్టాన సమాధానం స్ఫురించని చిక్కుప్రశ్నకూడా అదే!"

"కావచ్చు."

"అలాగే నువ్వు రెండేళ్ళకు మునుపు నన్నో ప్రశ్న అడిగావు..."

"........."

"నీకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. ఏమైనా అది నీలాంటి డాక్టరు డాక్టరీ విద్యతో ఏ మాత్రమూ పరిచయంలేని నాబోటి సాధారణ వ్యక్తిపైన ప్రయోగించవలసిన ప్రశ్న మాత్రం కాదు..."

"........."

"పోనీ, నేనే చెబుతాను. మనుషులకు జబ్బు లెందుకొస్తాయన్నది నీ ప్రశ్న. అవునా మూర్తీ?"

"అవును. దానికి సమాధానం ఎప్పుడైనా తీరిగ్గా ఆలోచించి చెబుతామన్నారు."

"ఆలోచించాను. ఈ మధ్య కొంతకాలం తీరిగ్గా అంపశయ్యపైన ఉండిపోయాను గదూ! ఒకానొక గొప్ప ప్రశ్నకు సమాధానం తెలుసుకోగలిగాను గనుక ఆ కాలం సద్వినియోగమైనట్టే!"

"చెప్పండి."

"నాకూ చెప్పాలనే ఉంది. లేనిపోని మాటలతో, శ్రోతలను అట్టే విసిగించడం మంచి పద్ధతి కాదు. కానీ నీ ప్రశ్నకు సమాధానం చెప్పేముందు నీకో చిన్న కథ చెప్పడం బాగుంటుందేమోనని..."

"కథకేం భాగ్యం మేష్టారూ? భేషుగ్గా చెప్పండి. అవసరమైతే ఒక ఉపోద్ఘాతాన్నికూడా జోడించి మరీ చెప్పండి."

"మనిషికి జబ్బులెందుకొస్తాయన్నది నీ ప్రశ్న! మనిషికి జబ్బులేగాదు. ఇంకా చాలా వస్తున్నాయి. సుఖాలు, కష్టాలు, ఆనందాలు, ఆందోళనలు మొదలైనవి. చిన్న చిన్న పరీక్షలతో డాక్టర్లు రోగ నిదానం చేయగలరు. మనిషి దిగులుగా ఉన్నాడా, లేక ఆనందంగా ఉన్నాడా అని తెలుసుకోదానికి ఆ మాత్రం పరీక్షలుకూడా అక్కర్లేదు..."

"ఎందుకూ! వాలకాన్నొకసారి ఎగాదిగా చూస్తే తెలిసిపోదూ..."

'మనిషి ఆనందంగా ఉన్నాడనుకో! ముఖం విప్పారి కలకలలాడుతుంది. కళ్ళల్లో కాంతి చిప్పిల్లుతుంది. శరీరం దూదిపింజలా తేలికై ఆకాశవీధుల్లో సంచరిస్తున్నంత హాయిగా ఉంటుంది. మనిషి దిగులుగా ఉన్నాడనుకో? ముఖాన మసిపూసినట్టుంటుంది. శరీరాన్ని లాక్కెళ్ళడం ఓ కొండను కదిలించినంత శ్రమగా ఉంటుంది. మిన్నులు విరిగి తలపైన పడిపోగా శరీరం భూమిలోకి క్రుంగిపోతున్నట్టుంటుంది. మరైతే ఈ శరీరమన్న వెండితెరపైకి యిలా నిరంతరంగా రంగుల్ని ప్రసరిస్తున్న ప్రొజెక్టరు ఏదో చెప్పగలవా మూర్తీ!

"చెప్పలేకేం మేష్టారూ! దాన్నే 'మనసు' అనవచ్చు."

"వెండితెర ఒక్కటే! ఉన్న రంగులుకూడా కొన్ని మాత్రమే! ఆ రంగుల అన్యోన్య సమ్మేళనంవల్ల ఒకప్పుడు తెరపైని దృశ్యం ఆనందకరంగా ఉంటుంది. మరొకప్పుడు భయంకరంగా ఉంటుంది. సారాంశమేమిటో చెప్పనా మూర్తీ! మనసులో ఉదయిస్తున్న ప్రతి భావవీచికా శరీరంపైన తన ప్రభావాన్ని ప్రసరిస్తోంది..."

"అర్థమైంది."

"ఒక కథ చెబుతాను" అన్నారు రావుగారు.

"యుగాల క్రిందటి కథ. ఒక అరణ్యంలో ముగ్గురు రాక్షసులుండేవారు. మహా బలవంతులు. ఎందరెందరో ఒక్కుమ్మడిగా ప్రయత్నించి చూచారు. వాళ్ళని గెలవడం సాధ్యం కాలేదు. చివరకు పరాజితులందరూ కలిసి ఓ మహర్షిని ప్రార్థించారు - అసురుల విజయానికి వెనుకనున్న రహస్యమేమిటో చెప్పవలసిందని!

"మహర్షి వివరించాడు: పోరాడుతున్నప్పుడు తాము పోరాడుతున్నామన్న ధ్యాసగాని, పోరాటం ముగిసిన తర్వాత తాము విజయం సాధించడం జరిగిందన్న స్పృహగాని ఆ రాక్షసులకుండటంలేదు. వాళ్ళు తమను తాము విస్మరించి యుద్ధం చేస్తారు. ఆపైన తమ విజయాన్ని గురించే తలపెట్టరు గనుక - విజయోత్సాహంవల్ల వాళ్ళు ఉబ్బి తబ్బిబ్బులయ్యే అవకాశమే లేదు. అదే వాళ్ళ విజయానికి వెనుక ఉన్న రహస్యం..."

"ఐతే వాళ్ళని ఓడించడానికి ఉపాయమే లేదా స్వామీ!"- పరాజితులు దీనంగా ప్రశ్నించారు.

"లేకేమి!" అన్నాడు మహర్షి - "తాము బలవంతులమన్న స్పృహ వాళ్ళకు కలగాలి. తాము విజేతలన్న గర్వం వాళ్ళల్లో ఉద్భవించాలి. యుద్ధం చేసిందీ, విజయాన్నీ సాధించిందీ ఈ శరీరమేనన్న స్పృహ వాళ్ళకెప్పుడైతే కలుగుతుందో, ఆ క్షణాన్నే వాళ్ళ శరీరాలు వాళ్ళ పాలిటికి బందిఖానా లౌతున్నాయి. నేను చేస్తున్నాననే ధ్యాస, నేను గొప్పవాడినన్న గర్వం - యివి మానవుణ్ణి శరీరమన్న చెరసాలలో నిర్బంధించి వేస్తున్నాయి. ఆ భావాల ఒత్తిడివల్లనే శరీరం నజ్జు గుజ్జయిపోతోంది. ఆపైన వాళ్ళను జయించడం ఎంత పని?"

రావుగారు ముగించారు - "యిలాగే జరిగింది. రాక్షసులు ఓడిపోయారు..."

కొంతసేపు మౌనంగా ఉండి మళ్ళీ ఆయనే కొనసాగించారు. "తాను చేస్తున్నానన్న స్పృహకి అతీతమైన కర్తవ్య నిర్వహణవల్ల మానవుడు వజ్రకాయుడవుతాడు. అజేయుడవుతాడు. అందుకు విరుద్ధంగా స్వార్థాన్ని గురించిన చింత, కీర్తికి సంబంధించిన ఆకాంక్ష అతణ్ణి దుర్బలుణ్నిగా చేస్తున్నాయి. వాటివల్ల మనిషి క్రుంగిపోతున్నాడు. నీ ప్రశ్నకు సదుత్తరం లభించినట్టేనా మూర్తీ!"

"జబ్బెలా నయమైందో చెప్పారు కారు..."

"జబ్బొకరు నయం చేసేదిగాదు. ఆరోగ్యం ఎక్కడైతే ఉండాలో అక్కడ ఉండనే ఉంది. జీవితం సాగరమైతే, శరీరమే పడవ. సముద్రజలాలకు పడవను తేల్చివేసే శక్తి కద్దు. కాని ఎంతవరకు? పడవకు బొరియలు ఏర్పడనంతవరకు! దిగులుతో క్రుంగిపోవడం, ఆందోళనతో అలమటించడం, ఆరాటంతో కుమిలి పోవడం, స్వార్థ చింతలతో తననుతాను సంకుచితపరచుకోడం, కీర్తికి మురిసిపోవడంలాంటి అలతలతో, కలతలతో శరీర నౌక వికలం కాకుండా చూసుకుంటే చాలు. సునాయాసంగా జీవిత సాగరాన్ని తరించవచ్చు."

ఆలోచిస్తూ కూర్చున్నాడు మూర్తి.

❖ భారతి - డిసెంబర్, 1964. ❖